క్లుప్తంగా

గర్భిణులకు వైద్యపరీక్షలు



ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులు

తాంసి: భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నిఖిల్‌రాజ్ మంగళవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గిరిగాం ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని 18 మందికి రక్త, బీపీ, ఇతర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, స్టాఫ్‌నర్స్ ప్రవీణ, జానాబాయి, ఏఎన్‌ఎం సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, మారుతిగూడకు చెందిన గోడం నాగోరావ్ సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసూద్, సోమోరే నాగోరావ్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కృష్ణ

ఆదిలాబాద్: ఈ నెల 29న హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ మైదానంలో నిర్వహించనున్న సహజ యోగా పరిచయ కార్యక్రమానికి హాజరు కావాలని తెలంగాణ సహజ యోగా కమిటీ అధ్యక్షుడు కృష్ణ మంగళవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ 28న సాయంత్రం 5 గంటలకు సైతం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కూడా మెగా పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామ దేవతలకు పూజలు



పూజలు చేస్తున్న రైతులు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ, గిర్నూర్, బజార్‌హత్నూర్, భూతాయి, గిరిజాయి, జాతర్ల, మోర్ఖండి, తదితర గ్రామాల్లోని రైతులు మంగళవారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. అనంతరం మేకలను బలిచ్చారు.

వర్షానికి పడిపోయిన విద్యుత్ స్తంభాలు

బోథ్: మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి కౌఠ, కనుగుట్ట గ్రామాల మధ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా ఈ రూట్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బోథ్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సిరా దేవేందర్ మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 24లోగా సమస్యలు పరి ష్కరించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్



విరిగిన విద్యుత్ స్తంభం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంగళవారం మధ్యాహ్నం ట్రాక్టర్ అదుపుతప్పి రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో విరిగిపోయాయి. రాత్రి వరకూ లైన్ సరిచేయకపోవడంతో కాలనీవాసులు ఉక్కపోతతో ఇబ్బందులకు గురయ్యారు.

పంచాయతీల్లో పైసల్లేవ్..!

- వేతనాలు అందక మల్టీపర్పస్ వర్కర్ల ఇబ్బందులు
- నిధులు రాక నిలిచిన పనులు
- పరేషాన్‌లో పంచాయతీ కార్యదర్శులు



నార్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నార్నూర్: గ్రామాల్లో సర్పంచుల పాలన గడువు ముగిసిపోవడంతో ప్రత్యేక అధికారులకు పరిపాలన బాధ్యతలు అప్పగించారు. గ్రామ కార్యదర్శుల క్షేత్రస్థాయి నిర్వహణలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ పాలన సాగుతోంది. కానీ వీరి పాలనకు ముందే పంచాయతీ ఖాతాలు ఖాళీ అయిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రత్యేక పాలన మొక్కుబడిగా మారింది. పంచాయతీల కనీస అవసరాలు తీర్చే బాధ్యత కార్యదర్శిపై పడింది. దీంతో నిధులు లేక పంచాయతీలో పనులు ముందుకు సాగడంలేదు.

మూడు ఖాతాలు ఖాళీ..

నార్నూర్ మండలంలో 23, గాదిగూడ మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రెండు మండలాలు కలిపి దాదాపు 40 వేల జనాభా ఉంది. గ్రామ పంచాయతీలో మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్తి పన్ను జమ చేసుకునే ఖాతా. వసూళ్లు అంతంత మాత్రమే.. ఖర్చు నాలుగింతలు ఉండడంతో ఇవి ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. రెండోది ఎస్‌ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఖాతా. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రత్యేక గ్రాంట్లు జమ చేస్తారు. ఈ రెండు ఖాతాలో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. మూడోది 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ఆధారంగా నిధులు అందజేస్తుంది. నాలుగు నెలలకోసారి వీటిని అందజేస్తారు. ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండగా వాటిని ప్రత్యేక సూచనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్టేట్ ఫైనాన్స్ నిధులు దాదాపు 14 నెలల నుంచి అందడం లేదు. నిబంధన మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

అప్పుల పాలైన కార్యదర్శులు

గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ ఫైనాన్స్ చెల్లింపు, మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు, తాగునీటి సరఫరా నిర్వహణ, పారిశుధ్యం, తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ వీటి నిర్వహణకు నిధులు అందక కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సమస్యలను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మేం తాత్కాలికం, నిధులు ఎలా సమకూర్చుకోవాలో మీకే తెలియాలి.. ప్రభుత్వం నుంచి నిధులు వస్తే ముందు మీరే తీసుకోవచ్చు.. మీరే సర్దుబాటు చేయండి.. అంటూ సలహా ఇచ్చి తప్పించుకుంటున్నారని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది కార్యదర్శులు ఒక్కో పంచాయతీలో రూ.లక్ష వరకు అప్పు చేసి ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. వర్షాకాలం సమీపించడంతో గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్ పనులు ఎలా చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని అర్థం చేసుకుని నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు తప్పని ఇబ్బందులు

కొన్ని పంచాయతీల్లో ఆర్నెళ్లుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వేతనాలు అందక వేరే పనిచేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది ఖరీఫ్ సాగులో భాగంగా పత్తి విత్తనాలు విత్తడానికి కూలీలుగా వెళ్తున్నారు. గ్రామ పంచాయతీలో పైసలు లేక అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రభుత్వం, అధికారులు ఆలోచించి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



రెండేళ్లుగా ఎస్‌ఎఫ్‌సీ, నాలుగు నెలలుగా సెంట్రల్ ఫండ్ రావడం లేదు. పనులు చేయాలంటే ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికే అప్పులు చేసి పనులు చేయించాం. ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

– లఖన్, పంచాయతీ కార్యదర్శి, చోర్‌గావ్

నాలుగు నెలలుగా జీతాల్లేవ్



నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. పంచాయతీ కార్యదర్శులను అడిగితే నిధులు లేవని, వచ్చిన తర్వాత ఇస్తామంటున్నారు. ఆర్థికంగా చాలా ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి వేతనాలు అందేలా చూడాలి.

– మెస్రం నాగోరావు, మల్టీపర్పస్‌వర్కర్, మాన్కాపూర్

నిధుల కొరత వాస్తవమే..

పంచాయతీలో నిధుల సమస్య ఉన్నమాట వాస్తవమే. కానీ పంచాయతీ పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలం సమీపించడంతో గ్రామాల్లో ముఖ్యంగా పారిశుధ్యం, క్లోరినేషన్‌పై దృష్టి సారిస్తున్నాం. నిధుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ప్రభాకర్, డీఎల్‌పీవో, ఉట్నూర్

దివ్యాంగుల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: దివ్యాంగుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల అలింకో సంస్థ సహాయంతో శారీరక దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్ అందిస్తామన్నారు. సదరం సర్టిఫికెట్ లేనివారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వాడవాడలా మార్నింగ్ వాక్, పల్లెబాట, ఫోన్ ఇన్, లాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, సమస్యలను నేరుగా తమదృష్టికి తీసుకురావాలన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ ఇస్తున్న ఐటీడీఏ అధికారి

బోథ్: మండలంలోని పార్డీకే గ్రామానికి చెందిన ఎం.భూమన్న కుమార్తె నిరుపమ గతేడాది బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించింది. ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి దరఖాస్తు చేసుకోవడంతో మంగళవారం డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది అనిల్ దేవరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గుడిహత్నూర్: అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మంగళవారం అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో వనజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న అద్దె, వంట గ్యాస్, కూరగాయల బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అంగన్‌వాడీలకు రూ.26 వేలు, ఆయాలకు రూ.21వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉస్మాన్, నాయకులు రాజు, ఛాయా, ఇందు, సంగీత, మహానంద, పార్వతి, శోభ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చర్చికాలనీ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండల కేంద్రంలోని చర్చికాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరుచొరబడి ఆహారధాన్యాలతో పాటు వంటసామగ్రి నీటమునిగాయన్నారు. పంటపొలాల నుంచి భారీగా వరదనీరు రావడంతో రాత్రంతా జాగరణ చేశామన్నారు. కాలనీ సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ఎంపీడీవో చంద్రశేఖర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే దుకాణం...కొనుగోలు భారం



జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి ఒకటి నుంచి ఐదో తరగతి పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రంలోని ఒకే బుక్ సెంటర్‌లో విక్రయిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు తమ పిల్లల తల్లిదండ్రులకు అదే బుక్ సెంటర్‌కు వెళ్లాలని సూచిస్తుండటంతో నిత్యం కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. ఇదే అదునుగా బుక్‌సెంటర్ యజమాని తన ఇష్టారాజ్యంగ ధరలను పెంచి విక్రయాలు చేపడుతున్నారు. దీంతో తల్లిదండ్రులకు పుస్తకాల కొనుగోలు భారంగా మారుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

వర్షం కోసం కప్పతల్లి ఆట



బేలలో కప్పతల్లి పూజలు

ఆదిలాబాద్‌టౌన్/బేల: వర్షాలు సమృద్ధిగా కురవాలని మంగళవారం జిల్లా కేంద్రంలో ఆగ్రో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో, బేలలో విత్తన విక్రయ కేంద్రాల డీలర్ల ఆధ్వర్యంలో కప్పతల్లి ఆట ఆడారు. జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్ నుంచి పట్టణంలోని పలు వీధుల గుండా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని మొక్కుకున్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి గంగ్రత్ సంతోష్, విలాస్ రెడ్డి, సంతోష్, రాజు, గణేశ్, ఆశరెడ్డి, రాము, లింగారెడ్డి, రవి, విలాస్ రెడ్డి, శ్రీను, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

ఇచ్చోడ: గిరిజన సంక్షేమ శాఖలో నాల్గో తరగతి ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సొకత్ హుస్సేన్ డిమాండ్ చేశారు. మేడిగూడ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన వసతి గృహాల్లో పనిచేస్తున్న కుక్, కామటి, వాచ్‌మెన్, అటెండర్లకు ఎనిమిదేళ్లుగా బదిలీలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బదిలీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పార్ట్‌టైం వర్కర్లకు బడ్జెట్‌లో వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిడాం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి



డీఎఫ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న రూపేష్‌రెడ్డి

కైలాస్‌నగర్: బేల మండలంలోని బాది గ్రామస్తులకు న్యాయం చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి మంగళవారం బాధిత రైతులతో కలిసి డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వే నంబర్ 58లోని అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న భూమిలో రైతులు ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆ భూమిలో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడంతో రైతులు జీవనోపాధి కోల్పోవడమే కాకుండా కూలీలుగా మారే పరిస్థితి తలెత్తిందన్నారు. అట్టి భూముల్లో సాగు చేసుకునే అవకాశం కల్పించేలా చూడాలని కోరారు. స్పందించిన డీఎఫ్‌వో రైతులకు తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు వసంతరావు, కొండల వినోద్, మాణిక్ రావు, శాలిక్, విలాస్, కొండల నారాయణ, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడించిన గ్రామస్తులు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తలమడుగు: అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ తలమడుగు గ్రామస్తులు మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా రాత్రి పగలు తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు విధించడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. రుయ్యడి నుంచి విద్యుత్ సరఫరా అందిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఏఈ సతీష్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఆసం రవి, యువజన సంఘాల సభ్యులు అర్షవేణు, అంబేద్కర్ సంఘం నాయకులు ఏలుగు ఆనంద్, జాలం చంద్రకాంత్, బడగరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి... ప్రమాదాల స్వారీ





మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా నది నుంచి నిర్మల్ జిల్లా సోన్ వరకు గల 44వ నంబర్ జాతీయ రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై అడుగుకో గుంత అన్నట్లుగా అస్తవ్యస్తంగా తయారైంది. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలను పలకరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. భారీ వర్షాలు కురిస్తే మరింత అస్తవ్యస్తంగా మారి ప్రమాదాలకు మూలమయ్యే పరిస్థితి తలెత్తనుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఊపందుకున్న ఖరీఫ్ పనులు



ఇంద్రవెల్లి: విత్తనాలు నాటుతున్న కూలీలు



ఇంద్రవెల్లి: విత్తనాలు వేస్తున్న రైతు కుటుంబం

బజార్‌హత్నూర్/ఇంద్రవెల్లి/తాంసి: జిల్లాలోని ఇంద్రవెల్లి, తాంసి, బజార్‌హత్నూర్ మండలాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో మంగళవారం రైతులు బిజీగా మారారు. ఒక్క వర్షంతోనే ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. పంటచేలలో ఎక్కడ చూసినా రైతులు విత్తనాలు విత్తుతూ, ఎరువులు వేస్తూ కనిపించారు.



బజార్‌హత్నూర్: విత్తనాలు విత్తుతున్న వ్యవసాయ కూలీలు